క్లుప్తంగా

డయల్ యువర్ డీఎంకు విశేష స్పందన

అవనిగడ్డ: స్థానిక ఆర్టీసీ డిపో కార్యాలయంలో శనివారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. పలు ప్రాంతాల నుంచి 16 మంది ఫోన్లు చేసి పలు సూచనలు చేశారు. గుడివాడ నుంచి అవనిగడ్డకు రాత్రి ఏడుగంటల తరువాత బస్సు లేదని, 8, 9, 10 గంటలకు బస్సులు నడపాలని కోరారు. అవనిగడ్డ నుంచి విజయవాడకు టు స్టాప్ సర్వీసులు, అవనిగడ్డ – మచిలీపట్నం మధ్య నాన్‌స్టాప్ సర్వీసులు నడపాలని పలువురు కోరారు. అవనిగడ్డ నుంచి విశాఖపట్నానికి ఏసీ సర్వీసులు నడపాలని, అవనిగడ్డ – విజయవాడ కరకట్ట మార్గంలో స్పీడ్లబ్రేకర్ల వల్ల రోజూ ప్రయాణించే వారు వెన్ను నొప్పి సమస్యలకు గురవుతున్నందున స్పీడ్‌బ్రేకర్లు తీయించాలని పలువురు విజ్ఞప్తి చేశారు. వీటన్నింటినీ ఉన్నతాధికారులకు తెలియజేసి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని డిపో మేనేజర్ కె. హనుమంతరావు తెలిపారు.

కబడ్డీలో తలగడదీవి విద్యార్థిని ప్రతిభ



నాగాయలంక(అవనిగడ్డ): నాగాయలంక మండల పరిధిలోని తలగడదీవికి చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థిని కొక్కిలిగడ్డ సుజాత రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైందని ప్రధానోపాధ్యాయుడు అన్నపరెడ్డి రామారావు తెలిపారు. నవంబర్‌లో గుడివాడలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచిన సుజాతను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశామని చెప్పారు. శనివారం జెడ్పీ హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో సుజాతను ఎంపీపీ భోగాది రాఘవరాణి, జెడ్పీటీసీ మోకా బుచ్చిబాబు, సర్పంచ్ భోగాది వెంకటేశ్వరరావు, హెచ్‌ఎం రామారావు, ఎస్‌ఎండీసీ చైర్మన్ వర్రే రాంబాబు, ఎస్‌పీసీ చైర్మన్ పాకా రవు సురేష్ అభినందించారు. ఉపాధ్యాయులు పద్యాల రఘురామయ్య, స్టాఫ్ సెక్రటరీ మద్దాలి సుబ్బారావు పాల్గొన్నారు.

లో ఓల్టేజీ సమస్యకు పరిష్కారం

గూడూరు: తుమ్మలపాలెంలో విద్యుత్ లో ఓల్టేజీ సమస్యకు పరిష్కారం లభించింది. పంచాయతీ పరిధిలోని పాత తుమ్మలపాలెం అంబేడ్కర్ విగ్రహం ప్రాంతంలో లో ఓల్టేజీ కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సర్పంచి కోడే రేణుకమ్మ విద్యుత్ శాఖాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి 16 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేయించారు. శనివారం సాయంత్రం ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు ప్రక్రియ పూర్తవగా వైఎస్సార్ సీపీ నాయకులు కోడే వెంకటేశ్వరరావు స్విచ్ ఆన్ చేసి ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభించారు.

ఇంటింటా అద్దంకి నాంచారమ్మ దర్శనం



పెదప్రోలు(మోపిదేవి): పెదప్రోలులోని అద్దంకి నాంచారమ్మ తల్లి జాతర మహోత్సవాల్లో భాగంగా రెండో రోజు శనివారం అమ్మవారు ఇంటింటా దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారికి నీళ్ల వారపోసి పసుపు, కుంకుమ, పూలు, పండ్లు, టెంకాయలతో హారతులు ఇచ్చారు. ఉదయం మేళతాళాలు, డప్పు కళాకారుల సందడితో అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త కమిటీ చైర్మన్ ఆకుల వెంకట్రామయ్య, కార్యదర్శి కూరపాటి కోటేశ్వరరావు, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ గురుప్రసాద్, పీఏసీఎస్ చైర్‌పర్సన్ ఆది రాంబాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

గుడివాడటౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందిస్తున్నామని డీవైఈఓ డాక్టర్ వినయ్‌కుమార్ కోరారు. స్థానిక టౌన్ హైస్కూల్‌లో 10వ తరగతి విద్యార్థులతో ఆయన శనివారం మాట్లాడారు. తొలుత పాఠశాలలో మౌలిక వసతులు పరిశీలించిన అనంతరం 10వ తరగతి, 8వ తరగతి విద్యార్థులను సబ్జెక్టులపై ప్రశ్నించారు. 8వ తరగతి విద్యార్థులు ట్యాబ్‌లు ఎలా వినియోగించుకుంటున్నారు, బైజూస్ క్లాస్‌లు అర్థం చేసుకుంటున్నారా లేదో పరిశీలించారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చిరు ధాన్యాలతో ఆరోగ్యం

గుడివాడటౌన్: ఆరోగ్యానికి చిరుధాన్యాలు ఉపయోగపడతాయని స్థానిక ప్రాంతీయ హోమియో పరిశోధనా సంస్థ(ఆర్‌ఆర్‌ఐ) డైరెక్టర్ డాక్టర్ రాజశేఖర్ అన్నారు. స్థానిక విద్యాలయ పబ్లిక్ స్కూల్‌లో ఆర్‌ఆర్‌ఐ ఆధ్వర్యంలో చిరుధాన్యాలు వాటి ప్రయోజనాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చిరుధాన్యాలు తీసుకుంటే పెద్దవారిలో జీర్ణశక్తి, రోగ నిరోధకశక్తి పెరుగుతుందని మధుమేహవ్యాధి నియంత్రణలో ఉంటుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ బృంద ఉపాధ్యాయిని, డాక్టర్ రాజేష్, విద్యాలయ డైరెక్టర్ బొప్పన విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మినుము ధరహాసం

- ప్రభుత్వం మద్దతు ధర పెంపు
- గణనీయంగా పెరిగిన మినుము సాగు
- దిగుబడులు, ధర బాగుండటంతో రైతుల హర్షం



చల్లపల్లి: రాష్ట్ర ప్రభుత్వం మినుము రైతులకు భరోసా కల్పిస్తూ ఈ ఏడాది కనీస మద్దతు ధర పెంచడంతో రైతుల కళ్లల్లో ఆనందం కనిపిస్తోంది. గత ఏడాది మినుము పంట క్వింటాకు రూ.6,300 ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది మినుము పంటకు కనీస మద్దతు ధర గతేడాది కంటే అదనంగా రూ.300 కలిపి క్వింటాకు రూ.6,600 ప్రకటించడంతో రైతులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏటా మినుము పంటకు మద్దతు ధర పెంచి ప్రకటిస్తున్న నేపథ్యంలో దళారులు కూడా గత్యంతరం లేక ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే అధిక రేటు చెల్లించి రైతుల నుంచి మినుములు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

60,769 ఎకరాల్లో మినుము సాగు

అవనిగడ్డ నియోజకవర్గంలో ఈ ఏడాది 60,769 ఎకరాల్లో మినుము పంటను రైతులు సాగు చేశారు. అత్యధికంగా ఘంటసాల మండలంలో 16,372 ఎకరాల్లో మినుము పంట సాగు చేశారు. కోడూరు మండలంలో 10,350 ఎకరాలు, చల్లపల్లి మండలంలో 9,825 ఎకరాలు, మోపిదేవి మండలంలో 9,667 ఎకరాలు, నాగాయలంక మండలంలో 9,588 ఎకరాలు, అవనిగడ్డ మండలంలో 4,967 ఎకరాల్లో మినుము పంట సాగు చేశారు.

ఆశించిన మేర దిగుబడి

ఈ ఏడాది మినుము దిగుబడి ఆశించిన మేరకు ఉంది. తెగుళ్ల బెడద పెద్దగా లేకపోవడం, నియోజకవర్గంలో నాలుగైదు గ్రామాల్లో కనిపించిన బంగారుతీగ సమస్యను వ్యవసాయ అధికారుల సలహాలతో సకాలంలో నిర్మూలించడంతో దిగుబడిపై తెగుళ్ల ప్రభావం కనిపించలేదు. 75 కిలోల బస్తా చొప్పున ఎకరాకు ఎనిమిది నుంచి పది బస్తాల మినుము దిగుబడి లభిస్తుందని రైతులు అంచనా వేశారు.

మంచి ధర



రాష్ట్ర ప్రభుత్వం మినుము పంటకు కనీస మద్దతు ధర రూ.6,300 నుంచి రూ.6,600లకు పెంచడం రైతులకు ప్రయోజనకరంగా ఉంది. దళారులు మార్కెట్లో ధర తగ్గించకుండా రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు రైతు పక్షాన నిలుస్తోంది. ప్రభుత్వ చొరవతో మినుము పంటకు మంచి ధర లభిస్తోంది.

– పాగోలు నాగ సీతారామారావు, చల్లపల్లి

రైతులకు అండగా ప్రభుత్వం



వైఎస్ రాజశేఖరరెడ్డి రైతుల పక్షపాతిగా అందించిన అండదండలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా అందిస్తూ ఆదుకుంటున్నారు. ప్రతి ఏటా మద్దతు ధర పెంచుతున్న రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు. ఇలాంటి ప్రభుత్వం ఉంటే మా శ్రమను మరిచిపోయి మరింత ఉత్సాహంగా వ్యవసాయం చేస్తూనే ఉంటాం.

– శీరం వెంకట సత్యనారాయణ, చింతలమడ

ఈ-క్రాప్ పూర్తి చేశాం



రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మినుము పంటకు ఈ క్రాప్ ప్రక్రియ పూర్తి చేశాం. మినుము పంటకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏటా కనీస మద్దతు ధర పెంచి ప్రకటిస్తున్న నేపథ్యంలో రైతులు మరింత ఆసక్తిగా మినుము పంట సాగు చేస్తున్నారు. మినుము సాగు విస్తీర్ణం గణనీయంగా పెరుగుతోంది. రైతులు కూడా ప్రభుత్వం ప్రతి ఏటా ప్రకటిస్తున్న మద్దతు ధరపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.

– గద్దె సాయిసింధు, చల్లపల్లి, ఏఓ

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

మంత్రి జోగి రమేష్



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి జోగి రమేష్

పెడన: రానున్న వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పెడన, గూడూరు, బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై శాఖల వారీగా అధికారులతో సమీక్షించారు. మంత్రి మాట్లాడుతూ తాగునీరు, జగనన్న కాలనీల పనులపై దృష్టి పెట్టాలని చెప్పారు. పైపులైన్లు అందుబాటులో లేని గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరాకు ఏర్పాట్లు చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను మంత్రి ఆదేశించారు. జగనన్న కాలనీల్లో సౌకర్యాల ఏర్పాటు పనులు వేగవంతం చేయాలని సూచించారు.

జగనన్నను మరోసారి సీఎంను చేయడమే లక్ష్యం కావాలి..

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రెండో ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా పార్టీ అనుబంధ శాఖల జిల్లా అధ్యక్షులు కృషి చేయాలని మంత్రి జోగి రమేష్ అన్నారు. ఇటీవల వైఎస్సార్ సీపీ అనుబంధ శాఖలకు మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షునిగా అయూబ్‌ఖాన్, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షునిగా మాతా సుబ్బారావు, చేనేత విభాగం అధ్యక్షునిగా యర్రా టార్జాన్‌లు నియమితులయ్యారు. ఈ సందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయంలో వీరు మంత్రి జోగి రమేష్‌ను కలిసి బొకేలు అందచేసి శాలువాలతో సత్కరించారు. తమకు జిల్లా బాధ్యతలు అప్పగించడానికి కృషి చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

అన్నపూర్ణమ్మ కుటుంబ సభ్యులకు పరామర్శ..

శుక్రవారం అనారోగ్యంతో మృతిచెందిన టీచర్ పి. అన్నపూర్ణమ్మ కుటుంబ సభ్యులను శనివారం మంత్రి జోగి రమేష్ పరామర్శించారు. 21వ వార్డు కౌన్సిలర్ పిచ్చుక సతీష్‌బాబు తల్లి అన్నపూర్ణమ్మ అంత్యక్రియలు శనివారం జరిగాయి. ఈ సందర్భంగా మంత్రి అన్నపూర్ణమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

పథకాలతో ఆదుకుంటున్న జగనన్న

- లబ్ధిదారుల ఆనందం
- మోపిదేవిలో గడప గడపకు మన ప్రభుత్వం



దివ్యాంగునికి పింఛన్ వివరాలు తెలుపుతున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

మోపిదేవి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నివర్గాలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ఆదుకుంటున్నారని పలువురు లబ్ధిదారులు ఆనందం వ్యక్తంచేశారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మోపిదేవి సచివాలయం-1లో శనివారం నిర్వహించారు. ఎమ్మెల్యే రమేష్‌బాబు తనయుడు వైఎస్సార్ సీపీ నాయకుడు సింహాద్రి వికాస్‌బాబుతో కలిసి 465 గృహాలను సందర్శించారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామస్తులు రోడ్లు, డ్రెయినేజీ వంటి సమస్యలు తన దృష్టికి తీసుకువచ్చారని, త్వరలోనే పరిష్కరిస్తామని చెప్పారు. టీడీపీ నాయకులు ఎల్లో మీడియాతో కలిసి కుట్రలు పన్నుతున్నారని, ఎవరెన్ని కుట్రలు పన్నినా ప్రజాభిమానం ఉన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి అవుతారని చెప్పారు. ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చడంతో గ్రామాల్లో మంచి స్పందన వస్తోందన్నారు. ఇటీవల నాగాయతిప్ప పాఠశాల ఆటస్థలాన్ని పేరెంట్స్ కమిటీ మెరక చేస్తుండగా టీడీపీ నాయకులు అడ్డుకుని విద్యార్థులను భయభ్రాంతులకు గురిచేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కుల, మతాలకు అతీతంగా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని చూసి ఓర్వలేక టీడీపీ రాష్ట్రంలో అశాంతి, అలజడులు సృష్టించాలని చూస్తోందని విమర్శించారు. సర్పంచ్‌లు నందిగం మేరీరాణి, గరికిపాటి వెంకటేశ్వరరావు(బుల్లి), ఎంపీటీసీ సభ్యులు కారుమూరి శివనాగరాజు, సనకా వెంకట రాజేష్‌బాబు, పీఏసీఎస్ చైర్‌పర్సన్లు రావి రామ ప్రసాద్, రెడ్రౌతు వెంకట రమణ, ఆది రాంబాబు, గరికిపాటి గోవిందరాజులు, కామిశెట్టి వెంకట సురేష్‌బాబు, కారుమూరి తాతయ్య తదితరులు పాల్గొన్నారు.

దళారీ వ్యవస్థ లేకుండా పథకాలు

పేర్ని కిట్టు వద్ద లబ్ధిదారుల ఆనందం



సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న పేర్ని కిట్టు

మచిలీపట్నంటౌన్: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో దళారీ వ్యవస్థ లేకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని పలువురు లబ్ధిదారులు ఆనందం వ్యక్తంచేశారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం 21వ డివిజన్‌లో జరిగింది. బందరుకోట రాజరత్నపురం ప్రాంతంలో పేర్ని కిట్టు గడప గడపకు వెళ్లి ఆయా కుటుంబాల వారికి అందుతున్న సంక్షేమ పథకాలను వివరించి సమస్యలు తెలుసుకున్నారు. తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం బాగుందని స్థానికులు చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో తమకు పలు సంక్షేమ పథకాలు అందాయని ఆ ప్రాంత మహిళలు పేర్ని కిట్టుకు వివరించారు. పేర్ని కిట్టు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్పొరేటర్ మన్నే శారద, డివిజన్ ఇన్‌చార్జి మన్నే శేషారావు, కార్పొరేటర్లు తిరుమలశెట్టి ప్రసాద్, ఐనం తాతారావు, రామిశెట్టి వాణిశ్రీ, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన



బంటుమిల్లి: చోరంపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఎస్‌ఐ ఎ. పైడిబాబు పలు చట్టాలపై అవగాహన కల్పించారు. శనివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్‌ఐ మాట్లాడుతూ బాలికల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినా, అసాంఘిక, అసభ్యకర ఫొటోలతో సెల్‌ఫోన్ల ద్వారా ప్రోత్సహించినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని వివరించారు. చైల్డ్ పోర్నోగ్రఫీ, పోక్సో యాక్ట్, శిక్షలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం కాశీ, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ సతీష్‌బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

గుడివాడటౌన్: సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండాలని మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ అన్నారు. నెహ్రూచౌక్‌లోని 2వ సచివాలయం, సత్యనారాయణపురంలోని 23, 24 సచివాలయాలను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉద్యోగుల హాజరుపట్టీలు, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించారు. సచివాలయ సిబ్బంది విధి నిర్వహణలో అలసత్వం వహించవద్దని, నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆత్మవిశ్వాసంతో నూరు శాతం ఉత్తీర్ణత



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ

గుడ్లవల్లేరు: పదో తరగతి విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా డైట్ ప్రిన్సిపాల్ కె.లక్ష్మీనారాయణ చెప్పారు. డోకిపర్రు ఎస్‌ఎస్‌వీజీఆర్ గవర్నమెంట్ హైస్కూల్లోని టెన్త్ విద్యార్థులకు శనివారం ఆయన కెరీర్ గైడెన్స్ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పాఠ్యాంశాల్లో వచ్చే సందేహాలను ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కె.టి.వి.వి.ఎస్.సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరీక్షలంటే భయం వద్దు

నిమ్మకూరు(పామర్రు): విద్యార్థులు పరీక్షలంటే భయపడొద్దని అంగలూరు డైట్ కళాశాల ప్రిన్సిపాల్ కె.లక్ష్మీనారాయణ అన్నారు. నిమ్మకూరు గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌ను ఆయన శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులు, విద్యార్థుల హాజరు శాతాన్ని, మధ్యాహ్న భోజన పథక వివరాలను పరిశీలించారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం లక్ష్మీ లత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పసుమర్రు(పామర్రు): పసుమర్రు జెడ్పీ హైస్కూల్‌ను డైట్‌కళాశాల ప్రిన్సిపల్ శ్రీమన్నారాయణ పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాణి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, శేఖర్ విద్యార్థులు పాల్గొన్నారు.

పచ్చిరొట్టతో భూములు సారవంతం



రైతులకు సూచనలు ఇస్తున్న ఏఓ హెప్సిబారాణి

గూడూరు: రబీలో మినుము సాగు చేస్తున్న రైతులు పంట కోసిన తర్వాత పచ్చిరొట్ట వేసుకోవాలని గూడూరు మండల వ్యవసాయ శాఖ అధికారి కె.హెప్సిబారాణి అన్నారు. పోసినవారిపాలెంలో శనివారం వ్యవసాయ శాఖ సిబ్బందితో కలిసి పొలంబడి నిర్వహించారు. రబీలో చేపట్టిన అపరాల సాగు ఆశాజనకంగా ఉండటంపై రైతులు సంతృప్తి వ్యక్తం చేశారు. పంట కోత పూర్తయిన తర్వాత పచ్చిరొట్టగా జీలుగ, పిల్లిపెసర, జనుము వంటి విత్తనాలు వేయాలని ఏఓ సూచించారు. తద్వారా భూమిలో సారం పెరిగి ఖరీఫ్‌లో అధిక దిగుబడులు సాధించవచ్చని వివరించారు. ఆర్బీకే చైర్మన్ అందే వీర వెంకట నాగేశ్వరరావు, అందే నాగరాజు, రామకృష్ణ, బూసి నాంచారయ్య, రంగిశెట్టి శ్రీనివాసరావు, రాధాకృష్ణ, వీఏఏలు టి.బ్రహ్మం, ఎం.కల్యాణ్, జె.పవన్ పాల్గొన్నారు.

క్విజ్‌లో ఏఎన్నార్ విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

గుడివాడటౌన్: నేషనల్ స్టాటిస్టికల్ ఆఫీస్ ప్రాంతీయ కార్యాలయం నిర్వహించిన పోటీల్లో తమ విద్యార్థులు ప్రతిభను ప్రదర్శించి పతకాలు సాధించారని ఏఎన్నార్ కళాశాల ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్ శనివారం తెలిపారు. ఈనెల 24న విజయవాడలోని కేబీఎన్ కళాశాలలో నిర్వహించిన సెమినార్, క్విజ్ పోటీలలో విద్యార్థులు కె.హరితశ్రీ, ఎస్.కుసుమ, బి.పవన్, ఎండీ యాసిన్ అహ్మద్‌ల జట్టు విశేష ప్రతిభను ప్రదర్శించి మూడో స్థానం కైవసం చేసుకున్నారన్నారు. వీరిని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కేఎస్ అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ శివనాథ్, స్టాటిస్టిక్స్ అధ్యాపకులు శ్రీదేవి, రమేష్, అపర్ణ అభినందించారు.

మహిళా సంక్షేమానికి రక్షణ సైన్యం సేవలు నిరుపమానం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డీఎన్నార్

మండవల్లి: మహిళా సంక్షేమానికి రక్షణ సైన్యం అందజేస్తున్న సేవలు నిరుపమానమని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. స్థానిక మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో రక్షణ సైన్యం గృహ సమితి మహిళా సదస్సు శనివారం జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మహిళల భద్రత, సంక్షేమంపై చిత్తశుద్ధితో పని చేస్తోందన్నారు. డీసీ మేజర్ పి.మణిబాబు, అధ్యక్షతన సమావేశం జరిగింది. లెఫ్టినెంట్ కల్నల్ కెజియాస్టాలిన్, అన్నామణి, మెర్సీ మంజుల, మేజర్ పి.అమృతవాణి, సర్పంచ్ మెండా ఝాన్సీ, సొసైటీ అధ్యక్షుడు బొమ్మనబోయిన గోకర్ణ, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బి.యేసోబు రాజు, నాయకులు పాల్గొన్నారు.

ఉగాదిలోగా గృహ నిర్మాణాలు పూర్తి చేయాలి

కైకలూరు: ఉగాదికి గృహ నిర్మాణాలను పూర్తి చేయాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) చెప్పారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలో నాలుగు మండలాల గృహ నిర్మాణశాఖ అధికారులు, రెవెన్యూ, పంచాయతీరాజ్, వర్క్ ఇన్‌స్పెక్టర్లతో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నివేశన స్థలాలకు భూమి అందుబాటులో లేకపోతే రెండు, మూడు గ్రామాల్లో కొనుగోలు చేస్తామన్నారు. మండవల్లి మండలం తరుగుమూల, లోకుమూడి లేఅవుట్ల పూడికపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. సమావేశంలో గృహ నిర్మాణ శాఖ డీఈఈ రమణమూర్తి, కైకలూరు, మండవల్లి, కలిదిండి తహసీల్దార్లు మురళీకృష్ణ, జనార్దనరావు, తేజమణి, ముదినేపల్లి ఎంపీడీఓ మల్లేశ్వరి, హౌసింగ్ ఏఈలు పాల్గొన్నారు.

ముదినేపల్లి రూరల్: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని ఎంపీడీవో పీ మల్లీశ్వరీ లబ్ధిదారులకు సూచించారు. హౌసింగ్‌డే సందర్భంగా మండలంలోని కోడూరులో జగనన్న కాలనీలోని ఇళ్ల నిర్మాణాల లబ్ధిదారులతో సమావేశాన్ని శనివారం నిర్వహించారు. అనంతరం స్థానిక ప్రాథమికోన్నత పాఠశాల అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసి ఉపాధ్యాయులకు, అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచనలు చేశారు. హౌసింగ్ ఏఈ శేషగిరిరావు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మెహర్‌బాబాకు పూజలు



చల్లపల్లి: అవతార్ మెహర్‌బాబా 129వ జన్మదిన వేడుకలు స్థానిక బాబా సెంటర్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. బాబా సెంటర్ నిర్వాహకులు సీహెచ్‌ఎం వీ శివరామ కృష్ణప్రసాద్, పత్రి వెంకట రమణారావుల ఆధ్వర్యంలో బాబా సెంటర్‌లో ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరిగాయి. వక్తలు ఆధ్యాత్మిక ప్రసంగాలు చేశారు. కమిటీ ఆధ్వర్యంలో వేలాది మందికి అన్న సమారాధన నిర్వహించారు.

కోనేరుసెంటర్: గోకవరం పంచాయతీ శివారు రెడ్డిపాలెం బాబా దర్బారులో శనివారం అవతార్ మెహర్‌బాబా జయంతి ఘనంగా నిర్వహించారు. మెహర్ బాబాకు బిస్మిల్లాబాబా పూజలు చేశారు. అనంతరం మెహర్‌బాబా జీవితచరిత్రను వివరించారు. విద్యార్థులకు స్వీట్లు పంచారు. గ్రామ పెద్దలు మంగయ్య, సయ్యద్‌బాజీ, నాగలింగం నాగేశ్వరరావు, షేరాలి, బాజీ, శ్రీను పాల్గొన్నారు.

విద్యార్థులకు సైకిళ్లు అందజేత



మచిలీపట్నంటౌన్: చిలకలపూడి పాండురంగ మునిసిపల్ హైస్కూల్ విద్యార్థులు 20 మందికి వైఎస్సార్ సీపీ నాయకుడు పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) శనివారం సైకిళ్లను అందజేశారు. బ్రహ్మపురానికి చెందిన కొండపల్లి సత్యనారాయణరావు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు శివరామకృష్ణ వీటిని సమకూర్చారు. పేర్ని కిట్టు మాట్లాడుతూ శివరామకృష్ణ పేద విద్యార్థులకు సైకిళ్లను కొనుగోలు చేసి ఇవ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో 9, 7 డివిజన్ల కార్పొరేటర్లు రాసంశెట్టి వాణిశ్రీ, పడమట రేవతి, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు చలమలశెట్టి గాంధీ, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ తోట సత్యనారాయణ, స్కూల్ ప్రధానోపాధ్యాయిని కనకదుర్గ పాల్గొన్నారు.

నేడు గంగానమ్మకు జలాభిషేకం

కోడూరు: కోడూరు గంగాభవానీ అమ్మవారి 11వ పునః ప్రతిష్ఠోత్సవాల్లో భాగంగా ఆదివారం మూలమూర్తికి జలాభిషేకం నిర్వహిస్తామని ఆలయ ధర్మకర్త కోట యుగంధరరావు శనివారం తెలిపారు. ఉదయం 8 గంటలకు అభిషేకాలు ప్రారంభమవుతాయని, భక్తులు స్వయంగా అమ్మవారిని జలాలలో అభిషేకించేందుకు అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు. అనంతరం సామూహిక కుంకుమార్చన, అమ్మవారికి విశేష పూజలు ఉంటాయన్నారు. రాత్రి 7 గంటలకు మహా చండీయాగానికి సంబంధించి సంకల్పం, గణపతిపూజ, అఖండ స్థాపన, మంటపారాధన, దీక్షాధారణ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. సోమవారం ఉదయం మహా చండీయాగం, అన్నసమారాధన నిర్వహిస్తామని చెప్పారు.